www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024
5
చిత్తూరు

నగరి ఆర్డీవోగా వెంకటరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగరి ఆర్డీవోగా వెంకటరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో ఆర్డీవోగా ఉన్న సుజన తుడాకు బదిలీపై వెళ్లడంతో కర్నూలు నుంచి బదిలీపై వచ్చిన వెంకటరెడ్డి నగరి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి నిబద్ధతతో ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. కార్యాలయానికి సంబంధిత వ్యవహారాలలో ఎలాంటి ఆలసత్వం లేకుండా సత్వరం పూర్తి చేస్తామన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా దేవరాజు

డీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న దేవరాజు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: జిల్లా విద్యాశాఖాధికారిగా దేవరాజులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతంలో అడ్మిటేషన్‌లో పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తిగా జిల్లాలో విద్యాప్రమాణాల పెంపుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యాశాఖ సిబ్బంది, ఎంఈఒల సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మన ఓటు.. మన భవిష్యత్తు'

వోట్ ఫర్ ఓపిఎస్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మన ఓటు మన భవిష్యత్తు (వోట్ ఫర్ ఓపిఎస్) అనే వాల్‌పోస్టర్‌ను యుటిఎఫ్ నేతలు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మన భవిష్యత్తు నిర్ణయించేది మనం ఎన్నుకున్న రాజకీయ నేతలే కానీ.. వారి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేది మన ఓటే అని, మన ఓటు ఎవరికో... అని పిలుపునిచ్చారు. అనంతరం నూతన జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజుని జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర నాయుడు, ఎన్.మణి గండన్, నాయకులు రెహానా బేగం, క్రిష్ణమూర్తి, ఏకాంబరం, పార్థసారధి, ఎస్‌పి బాషా, ఎంవి రమణ, శేఖర్, మాధవరెడ్డి, రమేష్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో నాడు- నేడు పనులు: ఎంఈవో

ప్రజాశక్తి- సోమల: మండలంలో ఫేస్ టు కింద ఎంపిక కాబడిన ప్రభుత్వ పాఠశాలల్లో నాడు- నేడు పనులను నాణ్యతతో వేగవంతంగా పనులు పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారిని శివరత్నమ్మ కోరారు. గురువారం ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లె గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు ఫేసు 2 పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం పరిశీలించి డోర్స్, కొళాయిలు నాణ్యతతో కూడినవి అమర్చాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరు ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని బుక్కపట్నం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని గురువారం ఎంఈఓ ఆంజనేయులు శెట్టి తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా నాడు -నేడు పథకం ద్వారా ప్రభుత్వ స్కూల్లో ప్రైవేట్ స్కూలుకు దీటుగా అభివృద్ధి చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన పౌష్టికాహారమైన మధ్యాహ్న పథకం భోజనాన్ని అందిస్తున్నారని రోజుకొక మెనూ ద్వారా సమగ్ర పౌష్టికాహారాన్ని అలాగే చదువుపై విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా స్కూల్ యూనిఫామ్, షూలు అందిస్తున్నారని తెలిపారు. సిఆర్పిలు దేవేంద్ర, సతీష్ కుమార్, టీచర్లు పాల్గొన్నారు

ఓపిఎస్‌కే మా ఓటు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర యుటిఎఫ్ పిలుపు మేరకు రాజకీయపార్టీ నేతలకు తమ మ్యానిఫెస్టోలో ఓపిఎస్ అమలు చేస్తామని చేర్చాలని కోరుతూ పోస్టుకార్డుల ఉద్యమం చేస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు తెలిపారు. గురువారం ఐరాల మండలంలో యుటిఎఫ్ ద్వారా రాజకీయ పార్టీకు పోస్టు కార్డుల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేస్తామని ప్రకటించే రాజకీయ పార్టీలకు తమ మద్దతుంటుందని తెలిపారు. పోస్టుకార్డుల ఉద్యమంలో యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని కెంచనబల్ల పరిధిలోని 85, 86 పోలింగ్ కేంద్రాలను గురువారం తహశీల్దార్ శ్రీధర్ పరిశీలించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించి, పలు సూచనలు సలహాలు అందించారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను నమోదు చేసుకొని ఉన్నత అధికారులకు నివేదిక పంపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

ప్రజాశక్తి- సోమల: పుంగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేడు 9వ తేదీ శుక్రవారం సోమలకు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తప్పక సహకరించాలని ఎంపీడీవో వరప్రసాద్ కోరారు. గురువారం శ్రీశక్తి భవన్ సమావేశ మందిరంలో సంఘమిత్రలు ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ఉదయం 11 గంటలకు రానున్నారని, మంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఏపిఎం శివ మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంత్రి రానున్న నేపథ్యంలో ఉన్నత పాఠశాలలో నిర్వహించే బహిరంగ సభలో అధిక సంఖ్యలో మహిళలు సంఘసభ్యులు పాల్గొని విజయవంతం చేసేందుకు సంఘమిత్రలు తోడ్పాటు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, ఎంఈఓ శివ రత్నమ్మ, సర్పంచులు వెంకటరమణ, రెడ్డప్ప, వనజమ్మ, ఎంపీటీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సదుం : నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా సంబరాలను శుక్రవారం సదుం జడ్పీ హైస్కూలు గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి తంబళ్లపల్లి శాసనసభ్యులు ద్వారకనాథ్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరెడ్డి, పుంగనూరు నియోజకవర్గం ఎన్నికల ఇన్చార్జి జింకా చలపతి పాల్గొననున్నారు. ఈకార్యక్రమానికి విజయవంతం చేయాలని జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మండలాధ్యక్షులు రెడ్డప్పరెడ్డి కోరారు.

ఆసరా.. ఏదీ.. ?

- గొప్పలు సరే.. డబ్బులేవీ..
- బ్యాంకు చుట్టూ మహిళల ప్రదక్షిణలు
- అయోమయంలో సంఘ సభ్యులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మహిళలను మహారాణులను చేసేలా ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా పేరుతో బ్యాంకులో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూ నాలుగు విడతలో స్వయం సహాయ సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. జగన్ మోహన్‌రెడ్డి 2019 ఏప్రిల్ 17వ తేదీ వరకు స్వయం సహాయ సంఘాల బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయ సంఘాల మహిళలు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని నాలుగు విడతలో మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతలో బ్యాంకు రుణాలు మాఫీ చేయాలి.



వైఎస్ఆర్ ఆసరా నిధుల మెగా చెక్కును అందజేస్తున్న ఎంపి రెడ్డెప్ప (ఫైల్‌ఫోటో)

జగన్ ప్రభుత్వం హామీ మేరకు నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కింద చిత్తూరు జిల్లాలో 33,655 ఎస్‌హెచ్‌జిలకు చెందిన 3,10,643 మంది రూ.324 కోట్లు విడుదల చేస్తూ గతనెల జనవరి 23వ తేది అనంతపురం జిల్లా ఉరవకొండలో భారీరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. అదే రోజు జిల్లాల వారీగా మంత్రులు స్వయం సహాయ సంఘాల మహిళలకు మెగా చెక్కులు అందజేశారు. నాటి నుండి నేటి వరకు స్వయం సహాయ సంఘాల మహిళలు ఆసరా డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు.

బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

ముఖ్యమంత్రి జగన్‌మోహ్మన్‌రెడ్డి స్వయం సహాయ సంఘాల మహిళల వ్యక్తిగత ఖాతాల్లో ఆసరా డబ్బులు జమచేస్తున్నట్లు జనవరి 23వ తేదీ బటన్ నొక్కి నిధులు విడుదల చేయడం, మండలాల వారీగా ప్రజాప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేసి జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలో డ్వాక్రా రుణాలు మాఫీ చేశారంటూ గొప్పలు చెప్పుకుంటున్నా.. డబ్బులు మాత్రం మహిళల ఖాతాల్లో జమకాక స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఆసరా పేరిట ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ పొందేందుకు బ్యాంకు వరకు వచ్చే పోయేందుకు రూ. 3, 4 వందలు ఖర్చు చేయాల్సి వస్తోందని అక్కచెల్లెమ్మలు వాపోతున్నారు. చిత్తూరు జిల్లాలో వైఎస్ఆర్ ఆసరా రుణమాఫీ నిధులు 70శాతం అక్కచెల్లెమ్మల వ్యక్తిగత ఖాతాల్లో నేటి వరకు జమకాకపోవడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ప్రభుత్వ రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారా లేదా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు సజావుగా జరగాలి

ఆర్డీవో వెంకట్రామి రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఎన్నికలను సజావుగా జరిపించాలని ఆర్టీవో, ఎన్నికల ఈఆర్వో వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం వెలుగు సమావేశమందిరంలో నియోజకవర్గస్థాయి ఏఈఆర్వోలు, సెక్టోరియల్ ఆఫీసర్లు, ఈడీఎంలు, రూట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, మండల సర్వేయర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు సాధారణ ఎన్నికల విషయమై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల క్లెయిమ్స్ 6,7,8కి సంబంధిత చేర్పులు, తొలగింపులు, సవరణల గురించి కొన్ని ముఖ్యమైన సూచనలు ఇచ్చారు. సెక్టార్ అధికారులు వారి సెక్టార్లకు సంబంధిత పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి వసతులను పరిశీలించి నివేదికను అందజేయాలన్నారు. మండల సర్వేయర్లు సెక్టార్లకు సంబంధిత రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లకు ఎన్నికల క్లెములను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు.

వేగంగా జనన, మరణ, మ్యారేజ్ ధ్రువపత్రాలు జారీ

జనన, మరణ ధృవపత్రాలు జారీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జనన, మరణ, మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు, ధ్రువపత్రాల జారీ సులభంగా, వేగంగా జరగాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ తెలిపారు. ధ్రువీకరణ పత్రాలజారీ అంశాలపై గురువారం నగరపాలక కార్యాలయంలో నగరపాలక సంస్థ, పంచాయతీ రాజ్, జిల్లా రిజిస్ట్రార్ శాఖల అధికారులకు, ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనన, మరణాలు, వివాహాల రిజిస్ట్రేషన్ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి మనిషి జీవితంలోనూ ఈ మూడు అంశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, ధ్రువపత్రాల జారీ పారదర్శకంగా జరగాలన్నారు. ఈచట్టాలపై సామాన్య ప్రజలకు ప్రాథమిక అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీపీవో లక్ష్మి, సహాయ కమిషనర్ గోవర్ధన్, పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి, ఏఎస్పోలు సౌందర్ రాజన్, నరసింహా, పంచాయతీ, వార్డు కార్యదర్శులు, జిల్లా రిజిస్టర్ ఉద్యోగులు, సీవోలు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలి

ప్రజలకు రక్షణ కల్పించాలి: సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగిరి మున్సిపాలిటీ పరిధిలో ఏకాంబర కుప్పం, ధరణి పంచాయతీలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. నగరిలో గురువారం జరిగిన సిపిఎం సమావేశానికి షణ్ముగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ నగిరి పరిధిలో రోజురోజుకి ఇసుక బకాసురుల ఆగడాలు ఎక్కువైపోతున్నాయని, వాటిని అరికట్టడంలో రెవెన్యూ యంత్రాంగం, పోలీసులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. రాత్రుల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ పర్మిషన్ లేకపోయినప్పటికీ ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో చుట్టుపక్కల రైతాంగం ఉన్న బోర్లలో భూగర్భ అడుగంటి పోవడంతో నీళ్లులేక వ్యవసాయానికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామస్తులు పదేపదే అడ్డుకున్నప్పటికీ వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. మంత్రి సొంత ఊర్లోనే ఇలా ఉంటే బయట ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. రాత్రులలో టిప్పర్లతోనూ ట్రాక్టర్లతోనూ తమిళనాడుకు తరలిస్తూ లక్షల రూపాయలు గడుస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా నగిరి నియోజకవర్గంలో ఉన్న వేలాది మంది పవర్ లూం కార్మికులకు గతంలో స్వయంగా ముఖ్యమంత్రి నగరిలో సమావేశంలో విద్యుత్తు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు కాలేదని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత పోరాట సందర్భంగా కుదిరించుకున్న అగ్రిమెంటు ప్రకారం కూలిరేట్లు కూడా అమలు చేయలేదని లేబర్ అధికారులు రెవెన్యూ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఇదే కాకుండా నియోజకవర్గంలో ప్రజాసమస్యలపై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నగిరి కార్యదర్శి పెరుమాళ్, నాయకులు మైల్ స్వామి, తంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జేసీబీతో దారి మూసేసే ప్రయత్నం చేయగా అడ్డుకున్న పేదలు

ప్రభుత్వ భూముల్లో రాజకీయ రాబందులు
పేదలపైనే 'రెవెన్యూ' ప్రతాపం

- వేలాది ఎకరాల్లో కబ్జారాయుళ్ల తిష్ట
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు
- పేదలపై కక్షసాధింపు చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి

కాయకష్టం చేసుకుని బతుకుతున్న నిరుపేదలు రెండు సెంట్లు ఇంటి స్థలం అడిగితే భూములే లేవంటూ రెవెన్యూ అధికారులు బుకాయిస్తున్నారు. అయితే ఒక్క కరకంబాడి ప్రాంతంలోనే వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల వివరాలను ప్రజా సంఘాల నేతలు వెలుగులోకి తీసుకురావడంతో అధికారులే విస్తుపోతున్నారు. ఆ భూములు ఎవరికిచ్చారో లెక్క తేల్చాలని పట్టుబడుతుండటంతో అధికార యంత్రాంగం నోరు మెదపలేక కనుగుడ్లు తేలేస్తున్నారు. ఎందుకంటే ఆ భూముల్లో ఇప్పటికే రాజకీయ రాబందులు పెద్ద ఎత్తున పాగా వేసేశారు.

ఒక్క కరకంబాడిలోనే వేల ఎకరాలు!

రేణిగుంట మండల పరిధిలోని ఒక్క కనకంబాడి రెవెన్యూ పరిధిలోనే వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు ప్రజా సంఘాల నేతలు సర్వే నెంబర్లతో సహా వెలుగులోకి తెచ్చారు. ఈ భూములను ఎవరికి కట్టబెట్టారో లెక్క చెప్పాలంటూ కలెక్టర్ లక్ష్మీ షాను నిలదీశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన ఈ భూములపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తానటూ హామీ ఇవ్వడం గమనార్హం.

వెలుగులోకి వచ్చిన ప్రభుత్వ భూములివే..

సర్వేనం	ఎకరాలు
1	- 7529.41-అడవి
153/1	- 125.65-అడవి
74	- 3485.16
340/1	- 2.15
666/2	- 2.72
714	-123.7

అనాదీన భూములు ఏమయ్యాయో

APEDC...705/1 -198.00 ప్రభుత్వ భూమి ఎవరికి కట్టబెట్టారో తెలియదు

పశువుల బైలు కోసం

100	-1.13 సెంట్లు
234	- 8.98
241/2	-1.93 సెంట్లు
621/9	-3.42 సెంట్లు
622/1	- 9.58 సెంట్లు
73/2	- 3.47 సెంట్లు

ఈ భూముల పరిస్థితి ఏంటని నిలదీస్తే రెవెన్యూ నుంచి సమాధానమే లేదు.

నివాస గృహాలకు

140/1	-11.22 సెంట్లు
140/2	- 2.93 సెంట్లు
746/1	-9.96 సెంట్లు

కేటాయించినప్పటికీ ఈ భూములను ఎవరికిచ్చారు అని ప్రశ్నిస్తే కళు తేలేస్తున్నారు.

జానెడు గుడిసెకు స్థలం ఇవ్వలేరా

జున్ను, భవన నిర్మాణ కార్మికురాలు

నేను 18 సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికురాలుగా పనిచేస్తున్నాను. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు మావి. కాయ కష్టం చేస్తే వచ్చే నాలుగు డబ్బులు మాకు తినడానికే సరిపోవడం లేదు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నారే కానీ మా గుడిసెకు మాత్రం జానెడు స్థలం ఇవ్వలేదు. అందుకే ఎర్రజెండా నీడన గుడిసె వేసుకున్నాం. అయితే తొలగించేందుకు అధికారులు కుట్రలు చేయడం దారుణం.

పేదలు సరే ...పెద్దోళ్ల సంగతి ఏంటి? : మోదీన్

ప్రభుత్వ కొండ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలని ఇబ్బందులు పాలు చేస్తున్నారు సరే... మరి వేలాది ఎకరాలను తమ కబంధహస్తాల్లో ఉంచుకున్న పెద్దోళ్ల సంగతి ఏంటో నిగ్గు తేల్చాలి. వందల వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జా చేస్తున్నా నోరు మెదపని ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్లు పేదల పైన కక్రపెత్తనం చేస్తుంటే ఊరుకోబోము. మాకు అండగా ఎర్రజెండా ఉంది. తాడో పేడో తేల్చుకుంటాం. వెనకడుగు వేసే ప్రసక్తే లేదు.

ఖాళీ చేసే ప్రసక్తే లేదు: మాయ

మేం వేసుకున్న గుడిసెలకు రాత్రింబవళ్లు కాపలాగా ఉంటున్నాము. మాకు న్యాయం చేసి ఇంటి స్థలం ఇవ్వనిదే ఇక్కడి నుంచి ఖాళీ చేసే ప్రసక్తే లేదు. అధికారులే కాదు రౌడీలు రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున కుయుక్తులు పన్ని పేదల గుడిసెల్ని తొలగించాలని పరితపిస్తున్నారు. ఎవరొచ్చినా మేమంతా సంఘటితంగా ఎదుర్కొంటాం.

జెసిబితో దారి మూసేందుకు విఫలయత్నం

ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా స్థలం ఖాళీ చేసేది లేదంటున్న పేదలు

కరకంబాడి లో పేదలు వేసుకున్న గుడిసెలకు వెళ్లే దారిని జెసిబి తో పూడ్చి చేసేందుకు రెవెన్యూ అధికారులు గురువారం సాయంత్రం విఫల యత్నం చేశారు. అయితే వందలాది మంది పేదలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని జెసిబిని అడ్డుపడ్డారు. తమ పట్ల ఎన్ని నిర్బంధాలను ప్రయోగించినా తాము ఇక్కడి నుంచి వెళ్లబోయేది లేదంటూ పేదల ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సత్యశ్రీ ,రాజశేఖర్ ఈ సందర్భంగా ప్రకటించారు. ఇక్కడున్న పేదలందరికీ న్యాయం జరిగేంత వరకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అధికారులకు చేతనైతే ఇక్కడే ప్రభుత్వ స్థలంలో పాగావేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న సిద్దుల రవి స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని సవాలు విసిరారు. పేదలంటే అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకి లోకువయ్యారని, అందుకే ఇలా పేదలపై బల ప్రయోగాలకు సిద్ధమవుతున్నారని విమర్శించారు.

వివక్షకు తావులేకుండా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వివక్షకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సదుకుప్పం పంచాయతీలో ఎన్నికల ప్రచార కార్యక్రమం మండల కన్వీనర్ రామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారిని ఎంత వెతికినా దొరకలేదని, సంక్షేమ పథకాలకు నిర్ధారించిన కొలమానంతో గ్రామ వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలఅన్నారు. ఎంపీపీ అమరావతి, సర్పంచులు సుబ్రహ్మణ్యం, ధనంజయరావు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ..!

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని గాంధీ నగరంలో అంబేద్కర్ విగ్రహాన్ని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షులు కన్నన్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, విగ్రహ ఆవిష్కరణ కర్త ఆంటోనితో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో పలువురు దళిత సంఘాల నేతలు మాట్లాడుతూ దళితకులంలో విద్యార్థులు బాగా చదువుకోవాలని, చదువు వల్లనే మనుగడ సాధ్యమని, ఆర్థికపరంగా ఎదగవచ్చు అన్నారు. నేటికీ కొన్ని ప్రాంతాల్లో కులవివక్షత కొనసాగుతున్నదని దీనిని రూపుమాపాల్సిన అవసరం ప్రభుత్వ యంత్రాంగంపై ఉన్నదన్నారు. దళితులంతా రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. యువజన సంఘం సభ్యులు అశోక చక్రవర్తి, రామాంజనేయులు, కుప్పం జనసేన ఇంచార్జ్ డాక్టర్ నరేష్, దళిత సంఘాల నాయకులు కందసామి, రామకృష్ణప్ప, రఘు, నారాయణస్వామి, అంబేద్కర్, విజయ్‌కుమార్, మునుస్వామి పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఐదు సంవత్సరాలు గుర్తురాని నిరుద్యోగులు ఎన్నికల సమయంలో టెట్, డిఎస్సి భర్తీ ప్రక్రియ ప్రకటించడం ఉట్టి మీద పాలు పెట్టి కింద ఉన్న పిల్లికి పాలు తాగించడం గుర్తుకొస్తుందన్నారు. ఈ విధానం వల్ల రాజకీయ లబ్ధి పొందడం తప్ప నిరుద్యోగులకు ఇలాంటి మేలు జరగదని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి మారుసాని గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం మెగా డిఎస్సి 25 వేలపై చిలుక భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6వేలు పోస్టులు చేయడం నిరుద్యోగులను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు కేవలం 101 పోస్టులు భర్తీ చేస్తామన్న ప్రభుత్వం ప్రకటనపై నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారాని జిల్లాలో డిఎస్సి అభ్యర్థులు 20వేల మందికి 101 పోస్టులు భర్తీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక: ఎంపిపి

ప్రజాశక్తి- వికోట: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక లాంటి వారని ఎంపీపీ యువరాజ్ తెలిపారు. రాబోవు ఎన్నికలను కార్యకర్తలను సన్నద్ధం చేయడంలో భాగంగా గురువారం జవునిపల్లి, నేర్నిపల్లి, బోడిగుట్లపల్లి, కుంబార్లపల్లి పంచాయతీల పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో వైస్సార్సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ సోమవారం నుండి వి.కోట మండల పరిధిలోని అన్ని పంచాయతీలలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైస్సార్సీపీ బహిరంగ సభలు సమావేశాలు నిర్వహించబోతున్నామన్నారు. ఈ సమావేశాలకు ప్రతిఒక్కరు పాల్గొనెలాచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'టిడిపిని ఆదరించండి..'

నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తెలుగుదేశం పార్టీకి అధికారం చేపట్టే విధంగా చూడాలని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ కోరారు. గురువారం మండలంలోని చిల్లగుండ్లపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను అమలు చేస్తామని, అధికారం చేపట్టిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 18 సంవత్సరాలు నిండిన వారికి రూ.1500లు నగదు, అమ్మఒడి వంటి స్కీములు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామ వాలంటీరు టిడిపిలో చేరారు. మండల అధ్యక్షులు జయప్రకాష నాయుడు, మాజీ ఎంపీటీసీలు లోకనాథం నాయుడు, మహేంద్ర, ధరణి భాష్యం, వంశీ, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి, వికోట, పలమనేరు, గంగవరం, పెద్దపంజాణిలకు సంబంధించి 27 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతు సాధికార ప్రకృతి వ్యవసాయంలో మెలుకువలు, విత్తన శుద్ధిపై వ్యవయాధికారులు అవగాహన కల్పించారు. కవిత, బారమ్మ, రాజమ్మల పొలాల్లో మోడల్ మేకర్ ఏగ్రేడ్ ప్రకృతివ్యవసాయంలో పంట దిగుబడి, కషాయాల తయారీపై సత్యసాయి జిల్లా నుంచి వచ్చిన ఏఎంఎంటి లక్ష్మీ కాంతం శిక్షణ ఇచ్చారు. అలాగే కుప్పం, రామకుప్పం మండల మేకర్ సి.విజయకుమారి, పెద్దపంజాణి మండల మేకర్ చంద్రశేఖర్ ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ ఇచ్చారు.

శభాష్ తేజస్విని..

రాష్ట్రస్థాయి బాలికల టెన్నికాయిట్ పోటీలలో విజేతగా నిలిచిన పెద్దఉప్పరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి - సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తేజస్విని రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీలలో విజేతగా నిలచి మండల, పాఠశాల పేరును చరిత్రలో నిలిపిందని పాఠశాల సిబ్బంది గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు. ఈనెల 5వ తేదీ ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీలలో బాలికల విభాగంలో మంచి ప్రతిభ చూపి విజేతగా నిలిచిందని ఇదేవిధంగా జాతీయస్థాయిలో కూడా ప్రతిభ చూపి మరి ఎన్నో బహుమతులు ప్రశంస పత్రాలు పొందాలని చిన్నారిని ఆశీర్వదించారు.

పాఠశాలలో తేజస్విని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డీవార్మింగ్ డే ను విజయవంతం చేద్దాం

జెడ్పిటిసి కుసుమ మోహన్

ప్రజాశక్తి- సోమల: మండలంలో 9వ తేదీ శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జడ్పిటిసి అమాస కుసుమ మోహన్ కోరారు. గురువారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రభుత్వం నులిపురుగుల నివారణ కోసం మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందని వీటిని పాఠశాల విద్యార్థులు భోజనానంతరం నమిలి మింగి నీటిని తాగాలని కోరారు. విద్యార్థులలో చురుకుదనం, చదువు పట్ల శ్రద్ధ, ఆరోగ్యం కలిగేందుకు ఈ మాత్రలు ఉపకరిస్తాయని తెలిపారు. మండలంలోని మూడు వైద్యశాలల పరిధిలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత కళాశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

సదుం: 9న జరగనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సదుం సిహెచ్‌సి విద్యాధికారి డాక్టర్ పుష్పకుమారి కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా సదుం మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలల్లో పాఠశాలల్లో, కళాశాలల్లో పిల్లలకు, విద్యార్థులకు ఆల్బెండజోల్ -400మిల్లీ గ్రాముల టాబ్లెట్స్ పంపిణీ చేయనున్నట్లు సదుం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పుష్పకుమారి, చెరుకువారిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గిరీష తెలిపారు.

మూలకాలను శాస్త్రబద్ధంగా వర్గీకరించిన వ్యక్తి మెండలీఫ్

ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మూలకాలను శాస్త్రబద్ధంగా వర్గీకరించిన వ్యక్తి మెండలీఫ్ అని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్ అన్నారు. గురువారం మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీరియాడిక్ టేబుల్ రూపకర్త, మూలకాలను శాస్త్రబద్ధంగా వర్గీకరించిన మెండలీఫ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్ మెండలీఫ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సైన్స్ ఉపాధ్యాయులు షంషీర్ ఖాన్, విజయ కుమారీలు మాట్లాడుతూ మెండలీఫ్ ఇచ్చిన ఆవర్తన నియమం ఆధారంగా మూలకాలను వర్గీకరణ సాధ్యమైనదనీ, దాని ఆధారంగా నవీన ఆవర్తనపట్టిక నిర్మాణం సాధ్యమైనదనీ తెలిపారు. విద్యార్థులు ఆవర్తనపట్టిక ఆకారంలో కూర్చొని మెండలీఫ్‌కు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు వేణురెడ్డి, కేశవులు, వెంకటస్వామి, దేవకి, అన్నపూర్ణదేవి, శుభలక్ష్మి, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ టీచర్ మాకొద్దు..

డిప్యూటీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: 'మా హైస్కూల్లో ఆ టీచర్ మాకొద్దు'.. అంటూ పలువురు విద్యార్థులు నిరసన వ్యక్తం చేసిన సంఘటన గంగాధర నెల్లూరు హైస్కూల్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం తనిఖీకి వచ్చిన డిప్యూటీ కలెక్టర్ వెంకటశివని కలిసిన విద్యార్థులు ఉపాధ్యాయురాలిని మార్చాలని కోరారు. తమ స్కూల్‌లోని ఓ మహిళా టీచర్ నిత్యం తమను కొడుతూనే ఉందని, అనుచిత వ్యాఖలు చేస్తుందని ఆరోపించారు. ఆ టీచర్‌ను మార్చి మరో టీచర్‌ను కేటాయించాలని డిప్యూటి కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట తహశీల్దార్ రవి, డీటీ తులసీరామ్, మండల సర్వేయర్ గణేష్, ఎలక్షన్ బీటీ విజయక్రిష్ట, పలువురు టీచర్లు ఉన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌కు వివరిస్తున్న విద్యార్థులు

చెన్నైలో స్థిరపడ్డ ఓటర్లను తొలగించండి..

ఆర్‌డిఓకు టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పుత్తూరు పట్టణంలోని 41 వార్డులోని 41వ పోలింగ్ బూత్‌లో వున్న చెన్నై, తమిళనాడుకు, తిరుపతికి 25 యేళ్ల క్రితం వలస వెళ్ళిన వారి ఓటర్లను, 5 యేళ్ల క్రితం వివాహం చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓటర్లను తొలగించాలని పుత్తూరు టీడీపీ పట్టణాధ్యక్షులు జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో నాయకులు గురువారం నగరి ఆర్డీఓ కె వెంకట రెడ్డికు ఫిర్యాదు చేశారు. అయితే ఇదే విషయమై తమ బిఎల్వో ఏలుమలై రెడ్డి, బిఎల్ఓ తేజశ్రీకి గత నెల 5వ తేది కోరితే ఆ బిఎల్‌ఎ 11వ తేది పుత్తూరు పోలీసు స్టేషన్‌లో తమపై కేసు నమోదు చేయడం దారుణంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. ఒక వేళ తమ బిఎల్‌ఏ ఎలుమలై రెడ్డి నిజంగా బిఎల్‌ఓని ఇబ్బంది పెట్టే వుంటే 6,7 తేదీల్లో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వుంటే సంతోషించే వారని, ఉద్దేశపూర్వకంగా తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసు నమోదు చేసి మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. వాస్తవానికి వలస వెళ్లిన వారి ఓట్లు పరిశీలించి ఇక్కడే వుంటే వుంచాలని, లేకుంటే ఓటర్ల లిస్టు నుంచి తొలగించాలని ఆర్డీఓను కొరామన్నారు. రాష్ట్ర వాణిజ్యవిభాగ ఉపాధ్యక్షులు డిఎస్ గణేష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆనంద్, పుత్తూరు పట్టణ ప్రధాన కార్యదర్శి ధనపాల్, వార్డు కౌన్సిలర్ వీడి రాధా అశోక్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అక్రమ మద్యం తరలిస్తున్న ముఠా అరెస్టు

వాహనం సహా భారీగా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి- వికోట: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని వీకోట మీదుగా జోరుగా సాగుతున్న కర్ణాటక అక్రమ మద్యం గుట్టును వీకోట పోలీసులు రట్టు చేశారు. కర్ణాటకలో లభించే మద్యాన్ని కొనుగోలు చేసి వాహనంలో మండల పరిధిలోని గ్రామాలకు తరలిస్తుండగా చాకచక్యంగా పోలీసులు పట్టుకున్నారు. పలమనేరు డిఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డీ కథనం మేరకు వివరాలు. రామకుప్పం మండలంకు చెందిన వసంత్ కుమార్‌రెడ్డి అతని అనుచరులతో కలిసి గత కొంతకాలంగా మద్యం అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. వికోట సిఐ లింగప్ప నేతృత్వంలో గురువారం బైరపల్లి క్రాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన ఎర్టిగా వాహనం పోలీసులను చూసి వెనుతిరిగేందుకు ప్రయత్నించారు. వాహనాన్ని వెంబడించిన పోలీసులు వాహనాన్ని నిలిపి పరిశీలించగా అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. రామకుప్పం మండలం కవంపల్లికి చెందిన డ్రైవర్ అరుణ్ కుమార్ రెడ్డిని అదుపులోకి తీసుకోగా మరో నిందితులు వసంత్ కుమార్ రెడ్డి పోలీసులు నుంచి తప్పించుకుని పరారయ్యాడు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పలమనేరు డిఎస్‌పి ఉమామహేశ్వర్ రెడ్డి వీకోటకు చేరుకుని మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమ మద్యం వ్యాపారం నిర్వహించే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పోలీసులకు పట్టుబడిన నిందితుడిని పోలీసులు విచారించగా గత కొంతకాలంగా కర్ణాటక మద్యాన్ని రామకుప్పం, వికోట మండలాల పరిధిలోని గ్రామాల్లో బెల్ట్ షాపులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు వీకోట పోలీసులు అక్రమ మద్యం రవాణాపై కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టుకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అక్రమ మద్యాన్ని, తరలిస్తున్న వాహనానిన స్వాధీనం చేసుకున్నారు.

విజిలెన్స్ అధికారుల దాడుల్లో

బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలో వాహనాల తనిఖీలలో భాగంగా తిరుపతి నుండి వచ్చిన విజిలెన్స్ అధికారులు సమాచారంతో గంటాఊరు సమీప జాతీయ రహదారి ఆంజనేయస్వామి గుడి దగ్గర తమిళనాడుకు అలాగే కర్నాటక బంగారుపేటకు, అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్ రైస్ వాహనాన్ని పట్టుకొన్నారు. బియ్యంను తరలిస్తున్న నిందితుడు సద్దార్‌ను అదుపులోకి తీసుకోని విచారించారు. ఇతను కొన్ని సంవత్సరాలగా, ఎపి పిడిఎఫ్ బియ్యాన్ని, అక్రమంగా తరలిస్తూ సరిహద్దు రాష్ట్రాల్లో అమ్ముకుంటూ, లక్షల రూపాయలు సొమ్ములు గడించేవాడని విచారణలో తేలిందన్నారు. పలమనేరు అర్బన్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ తిరుపతి విజలన్స్ అధికారులు పిడిఎఫ్ బియ్యం లారీని పట్టుకుని అప్పగించారని తెలిపారు. పిడిఎఫ్ రైస్ వాహనాన్ని సీజ్ చేశామని బియ్యం విలువ లక్షకుపైనే ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బైరెడ్డిపల్లి టు నాలుగు రోడ్లు జాతీయ రహదారిలో ఆటో నడుపుతూ జీవనం సాగించే చిన్నరెడ్డప్ప గురువారం కూడా ఆటోలో ప్యాసింజర్‌తో బయలుదేరాడు. అయితే మార్గమధ్యంలో హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో ఓ పక్కకు ఆటో ఆపి ప్యాసింజర్లను కిందకు దింపి సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో ఆటోలోని వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప ఆటో డ్రైవర్ భార్య పద్మమ్మ, కుమారుడు గణేష్‌ను పరామర్శించి చిన్నరెడ్డప్ప మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.

వైసీపీ నేత మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరి మున్సిపాలిటీ కీళపట్టుకు చెందిన ఎన్.ఆరుముగం (62) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన ప్రస్తుత దేశమ్మ దేవాలయ కమిటీ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన మృతికి పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.

సంక్షిప్త వార్తలు

200 మందికి అన్నదానం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎంవి.శ్రీధర్ రెడ్డి ఆర్థిక సహాయంతో 200మందికి అన్నదాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎంవి శ్రీధర్ రెడ్డి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గాదేవికి, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బందికి క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, రెడ్ క్రాస్ మండల ప్రెసిడెంట్ పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా విద్యాసంస్థల ప్రాంగణంలో గురువారం డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు అకాడమిక్ అధిక రాజేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ వైద్యశిబిరంలో కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు బస్సు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేయడంతోపాటు మరికొందరికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం శంకర్ నేత్రాలయ బెంగళూరు వారి ఆధ్వర్యంలో మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ అర్పిత హాజరయ్యారు. వైద్యశిబిరంలో 61 మంది రోగులకు కంటి పరీక్షలు చేయగా 14మందిని కంటి ఆపరేషన్ చేయుటకు పంపడమైనదని వారు తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు చేసుకొని సురక్షిత కంటి చూపుతో జీవించాలని కోరారు. కంటి ఆపరేషన్లు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ల పనితీరును తనిఖీ చేశారు. డాక్టర్ ప్రవీణ్, సిహెచ్‌ఓ శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మహావైభవం క్షీరతత్వరణం

ప్రజాశక్తి- చిత్తూరుడెస్క్: పట్టణ పరిధిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న నేత్ర ప్రదాయణి దేశమ్మ ఆలయ కుంభాభిషేకోత్సవంలో 4వ రోజైన గురువారం క్షీరతత్వరణం, బింబసంస్కారం, కుంభకలశపూజ, చతుర్విదహోమ పూజలు వైభవంగా జరిగాయి. రాష్ట్రపర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ఈ పూజలకు హాజరుకాగా ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో రామచంద్రయ్య ఆమెకు కుంభకలశ ఆహ్వానం పలికారు. మంత్రితో పాటు పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు ఆలయకమిటీ చైర్మన్ అమ్మవారి కండువాలను వేసి గౌరవ ఆహ్వానం పలికారు. భక్తిశ్రద్దలతో పూజలకు హాజరైన మంత్రి చతుర్విద హోమ పూజల్లో పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలు శుభ్రం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని చప్పిడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోనీ గంగారుపురు గ్రామంలో కొన్ని రోజులుగా మురుగునీటి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ విజయప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య ఆధ్వర్యంలో గురువారం గ్రీన్ అంబజార్ల సహాయంతో గ్రామంలోని డ్రైనేజ్ కాలువలను శుభ్రం చేయించారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- పలమనేరు: మండలంలోని టి. వడ్డూరులో గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం సంఘాల సభ్యులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం, సిసి హరి, సచివాలయం సిబ్బంది హాజరయ్యారు.

సీడ్ బాల్స్, టీ షర్టులు వితరణ...!

ప్రజాశక్తి - రామకుప్పం: కుప్పం లయన్స్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రేరణ బెంగళూరు వారి ఆధ్వర్యంలో రామకుప్పం మండలంలోని ననియాల అటవీ శాఖ సిబ్బందికి సీడ్ బాల్స్ మరియు టీషర్టులను వితరణ చేశారు. అదేవిధంగా అక్కడ ఉన్న ఏనుగులకు ఒకపూట ఆహారాన్ని అందించడం జరిగిందని కుప్పం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు రీజనల్ చైర్పర్సన్ డాక్టర్ ఎ.మహేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ యావత్ ప్రపంచానికి తెలిసిన స్వచ్ఛంద సేవాసంస్థ లయన్స్ క్లబ్ తరఫున కుప్పం ప్రాంతంలో ఎన్నో సేవాకార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి- సోమల: గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ వైద్య అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని, తప్పనిసరిగా ప్రతినెలా ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన కార్యక్రమం కింద వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని పెద్ద ఉప్పరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి బాలాజీ సూచించారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు వైద్యపరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, రక్తం అభివృద్ధి చెందుటకు ఐరన్ మాత్రలు, కాల్షియం విటమిన్ మాత్రలను అందచేయడం జరిగిందన్నారు. అలాగే హైరిస్క్ ఉన్న ఒకరిని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సమ్మె కాలంలో మరణించిన అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వం ఆదుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు ప్రేమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన అంగన్వాడీల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు 42 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సందర్భంగా సమ్మెకు సంఘీభావం తెలిపి అన్ని విధాల సహకరించిన సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు, ఎస్‌టియు మున్సిపల్, మెడికల్, ఆర్టీసీ సంఘాల నాయకులకు ఉద్యోగ సంఘాల నాయకులకు, రాజకీయ పార్టీలు తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్, బీఎస్పీ, సిపిఐ, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులకు తరపున ధన్యవాదాలు తెలిపారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమిపూజను గురువారం జై భీమ్ సేవ సంఘం నిర్వాహకులు దేవ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పిటిసి సోమశేఖర్ మాట్లాడుతూ రెడ్డప్ప, మిథున్‌రెడ్డి ఎంపీల నిధులతో రూ.50లక్షలు మంజూరైందని తెలిపారు. అందులో మొదటివిడతగా రూ.25 లక్షలతో పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మాణం దళిత వర్గానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఎంపిటీసీ ఉషారాణి, ఉపసర్పంచ్ కామరాజు, దళిత నాయకులు గోవింద్ చంద్రన్, రాజశేఖర్, వరదయ్య, రాజేష్ మాణిక్యం వాసు పాల్గొన్నారు.

సిఆర్‌పి జిల్లా అధ్యక్షులుగా కృష్ణమూర్తి

బంగారుపాళ్యం: జిల్లా సిఆర్‌పి అధ్యక్షులుగా కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మాజీ జిల్లా అధ్యక్షులు విల్వనాథ్ తెలిపారు. గురువారం జిల్లా ఎన్నికలను నిర్వహించారు. జిల్లా సిఆర్‌పి అధ్యక్షులుగా బంగారుపాళ్యం మండలం తుంబుకుప్పం సిఆర్‌పిగా పనిచేస్తున్న కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, CHITTOOR
I.A.No. 114 /2020 & I.A.No. 453 /2023 & I.A.No. 454 /2023 & I.A.No. 15 /2017

Between
Smt Kothapalli Vasanthamma ....Petitioner/Plaintiff
And
Ramakrishna Reddygari Srinath Reddy(Died) & Others ...Respondent/Defendants

To
The Respondents No.7 and 8
1. Vamsi,S/o Late Ramakrishna Reddygari Srinatha Reddy **(R7)**
2.Yamuna
D/o Late Ramakrishna Reddygari Srinatha Reddy **(R8)**
No.1 to 2 are residents of D.No.22-965/6, Kameswara Nagar,Murugunapalli Village, Chittoor Town,Mandal and District
(Proposed LRs of D1)

Take notice that the above petition **I.A.No.114/2020** filed under Sec.5 of Indian Limitation Act, **I.A.No.453/2023** filed under Order 22 Rule 9 CPC and **I.A.No.454/2023** filed under Order 22 Rule 4 CPC in **O.S.No.15/2017** are stands posted to **28-02-2024 at 10.30 A.M** for your notice and appearance before the above court. Therefore you are at liberty to appear either in person or through Advocate to appear before the above court on **28-02-2024 at 10.30 A.M** and to raise objections if any, failing which the matter will be decided accroding to law.

Sd/- G.VASANTHA KUMAR
Advocate for Petitioner
Place: Chittoor Date:06.02.2024

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, CHITTOOR
O.S.No. 505 of 2021

Between
N.Sisupalan ...Plaintiff
And
N.Narayana Reddy and another ... Defendants

SUMMONS TO DEFENDANTS NO.2

To
D2) K.Hariprasad Reddy,
S/o K.Narayana Reddy,
Peddakuntapalli Village,Papireddipalli Post, Gangadhar Nellore Mandal, Chittoor District

Sir, Please take summons that the above Suit filed by the plaintiff against you and K.Narayana reddy for recovery of money stands posted to **14-03-2024** for your appearance. Therefore, Please be present either by person or through your advocate before the above court by **10-30 A.M on 14-03-2024** and file your written stantement in the suit if any in the above matter without fail, otherwise, the above matter will be decided ex-parte

Sd/- U.SESHADRI NAIDU
Advocate for Plaintiff
Place: Chittoor Date:06.02.2024

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, CHITTOOR
O.S.No. 227 of 2020

Between
R.Munichandraiah ...Plaintiff
And
A.Ansar Basha ...Defendant

SUMMONS TO DEFENDANT

To
Defendant
A.Ansar Basha,
S/o Shaik Azeez Basha,
D.No.23-265/A,Sanjay Gandhi Nagar, Chittoor Town and District

Sir, Please take summons that the above Suit filed by the plaintiff for recovery of money against you stands posted to **14-03-2024** for your appearance. Therefore, Please be present either by person or through your advocate before the above court by **10-30 A.M on 14-03-2024** and file your written stantement in the suit if any in the above matter without fail, otherwise, the above matter will be decided ex-parte

Sd/- U.SESHADRI NAIDU
Advocate for Plaintiff
Place: Chittoor Date:06.02.2024